





గద, నాగలితో పవన్ కల్యాణ్, చంద్రబాబు



వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభివాదం

గూడెంలో ఉమ్మడి సభ

సూపర్ హిట్

రాష్ట్ర భవిష్యత్ కోసమే కలిశాం


ఆశీర్వదించండి.. గెలిపించండి

- ఉమ్మడి వేదికపై చంద్రబాబు, పవన్ పిలుపు
- సభ భావోద్వేగాలు.. అభిమానుల కేరింతలు
- దూర ప్రాంతాల నుంచి భారీగా రాక
- ఎన్నికల ముందే టీడీపీ-జనసేన శ్రేణులకు అధినేతల దిశా నిర్దేశం

తాడేపల్లిగూడెం/ఏలూరు/భీమవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన పొత్తు తాడేపల్లి ప్యాలెస్‌ను కకావికలం చేస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వివిధ వర్గాల భవిష్యత్తు కోసం మేం కలిశాం. మమ్మల్ని ఆశీర్వదించండి.. గెలిపించండి' అంటూ టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అత్యంత ఉద్వేగంతో వైసీపీ పైకి వారు సవాళ్లు విసిరారు. ఇది నిజమా..? కాదా ? అంటూ సభికుల నుంచి సమాధానాలు రాబట్టిన ప్రసంగాలు సాగిన తీరు అందరిని హత్తుకుంది. 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద బుధవారం సాయంత్రం నాలుగున్నరకు మొదలైన భారీ బహిరంగ సభ రాత్రి ఎనిమిది గంటల వరకు సాగింది. టీడీపీ-జనసేన ఎన్నికల పొత్తులో భాగంగా ఇటీవల 99 మంది పోటీ చేసే అభ్యర్థులతో తొలి జాబితాను ఇరు పార్టీలు ప్రకటించాయి. దీని తర్వాత ప్రజలకు ఉమ్మడి సంకేతం ఇచ్చేందుకు సాగిన సభకు తొలిసారిగా అధినేతలు ఇద్దరు ఒకే వేదిక పైకి వచ్చారు. ఇది అటు పవన్ అభిమానులకు, ఇటు చంద్రబాబు కేడర్‌కు పండుగగా మారింది. ఇరువురు నేతలు పరస్పర ఆలింగనాలు సభికులకు మరింత కనువిందు చేసింది. ప్రత్యేకించి పొత్తు ఆ తదుపరి అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎంతో క్రమశిక్షణతో నేతలు ఇద్దరు ఉమ్మడిగా జరిగిన సభలో అందరి మనసులు దోచారు. చంద్రబాబు సైతం సుమారు 50 నిమిషాలపాటు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఎన్నికల ముందు ముద్దులు.. గెలిచాక మీడియాతో సహా అందరిపైన పిడిగుద్దులా అంటున్నపుడు సభికులు అవును అవునంటూ తెలిపారు.

రెండు కలిసే నడుస్తున్నాయి : చంద్రబాబు

'ప్రజలకు రోషం ఉందా.. మాకైతే రోషం ఉంది. ఒక సీనియర్‌గా జరుగుతున్నందంతా చూస్తూ ఊరుకోలేను. ప్రశ్నించే గుణం ఉన్నా పవన్ సైతం మౌనంగా ఉండలేదు. జనం కోరుకునే వెలుగు మీకు ఇచ్చే బాధ్యత మాది' అంటూ చంద్రబాబు భరోసా ఇవ్వడం అందరిని సంతృప్తి పరిచింది. రాష్ట్ర విభజన అంశాలు ప్రజలకు గుర్తు చేస్తూ అప్పట్లో జరిగిన నష్టాన్ని ఎత్తి చూపాం. ఇప్పటికి అదే ధోరణిలో రాష్ట్రాభివృద్ధికి అనువుగానే జనసేన టీడీపీ లక్ష్యాల తీరు ఉందని చంద్రబాబు ప్రజలకు పదే పదే వివరించారు. ప్రజల కోసం కన్న కలల సౌధాన్ని జగన్ వచ్చి నాశనం చేశాడు. పొత్తు ఎందుకని ఆలోచిస్తే అందరికి అవగాహన వస్తుంది. ఆఖరికి అంతర్జాతీయ క్రికెటర్ విహారిని రాష్ట్రం నుంచి పారిపోయేలా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అంటూ గుర్తు చేసినప్పుడు షేమ్ షేమ్ అంటూ సభికులు ప్రతిస్పందించారు. రాష్ట్రంలో కులాల మధ్య ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి సర్వ నాశనం చేయాలని, ఆ దిశగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాని, నేను, పవన్ రాష్ట్రాన్ని నెంబర్-1 చేయాలనుకుంటున్నాం. సినిమా టిక్కెట్లలోను రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబు. ఇది భావ్యమా' అంటూ ప్రశ్నించి సభికుల నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. వచ్చే ఎన్నికల్లో మన గెలుపును ఎవరూ ఆపలేరని, బాధ్యత కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశామని మాఫియా నేతలు కావాలా.. మంచి నేతలు కావాలంటూ ప్రజలను ప్రశ్నించారు. ఉద్యోగుల అంశాలను ప్రస్తావిస్తూ ఇప్పుడున్న ప్రభుత్వం ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయబోతున్నామో త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కిందిస్థాయి కేడర్‌లో ఉన్న భావాలను స్పృశిస్తూ ..ఇగోలకు పోవద్దు.. ఒక పార్టీ వెనుక ఇంకో పార్టీ నడుస్తున్నట్టు భావిస్తారు. ఇదంతా కాదు రెండు పార్టీలు కలిసి నడుస్తాయని భావించాలని, అనుభవంతో చెబుతున్నానని చంద్రబాబు ప్రకటించిప్పుడు టీడీపీ-జనసేన కేడర్ సంతృప్తితో కేరింతలు కొట్టారు. టీడీపీ కేడర్ ఎంపిక తీరుపై అక్కడక్కడ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా పరోక్షంగా ప్రస్తావిస్తూ అందరికి తగిన న్యాయం చేయడం సాధ్యం కాదని, అవకాశాలను బట్టి అందరికి ఆమోదయోగ్యంగా న్యాయం చేస్తామన్నారు. పవన్ కల్యాణ్ కూడా కాస్తంత ఉత్తేజభరితంగానే మాట్లాడుతూ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఇంతకు ముందు జరిగిన తన ఓటమిని గుర్తు చేసుకున్నారు. పొత్తులో జనసేన ఎన్ని సీట్లు తీసుకోవాలి.. సీఎం పదవిని ఎలా పంచుకోవాలి అంటూ లేఖలతో సలహాలు ఇచ్చిన వారందరికి నర్మగర్భంగా మాట్లాడుతూ చెక్ పెట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. జిల్లా నుంచి ఇటీవల సలహాలు ఇస్తూ బహిరంగ లేఖలు రాస్తున్నారు. కొందరు సీనియర్ల లేఖలు పొత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఒంటరిగా పోటీ చేసే శక్తి ఇప్పటికిప్పుడు జనసేనకు లేదు. నాపై విమర్శలు చేసే వారు ముందుగా దీనిపై ఆలోచించాలి. జగన్ వెనుక ఉన్న సమూహాలు మాత్రం తప్పు చేసినా దోపిడీ చేసినా ఆహా.. ఓహో అంటూ ఉన్నారు. వెనకేసుకొస్తున్నారు. కాని, సామాన్యుడు రాజకీయం చేస్తే ఇలాగే ఉంటుందని నిరూపిస్తా. ఎవరికి ఎంత ఓపికో పరీక్షించుకోవాలి. నాతో నిలబడి.. నా వెంట నడిచేవారే నా వాడు'.. అంటూ పవన్ ఉద్వేగంగా మాట్లాడటంతో సభికులు నుంచి స్పందన లభించింది. ప్రత్యేకించి సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు, నేను రాష్ట్రం కోసమే కలిసి పని చేస్తామంటూ స్పష్టం చేశారు.



సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్



వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ తదితరులు



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

అందరి చూపు వేదిక మీదే..

ఓ వైపు సభా సమయం రాత్రి గడుస్తున్నా అందరిచూపు వేదిక మీదే వుంది. టీడీపీ-జనసేన రాష్ట్ర నియోజకవర్గ నేతలు ఆశీనులు కావడమే నిదర్శనం. ఏ ఒక్క పార్టీ తక్కువ కాదని అంతా సమానమేని అన్నట్టుగా వేదికపైన మొత్తం 500 మంది కూర్చోగా రెండు పార్టీల నేతలకు చెరి సగం అన్నట్టుగానే సభా వేదిక ఏర్పాటు చేశారు. ఒక వైపు టీడీపీ జెండా, మరో వైపు జనసేన జెండా ఉండేలా ఈ పతకాల కిందే ఇరు పార్టీలు నేతలు ఆశీనులయ్యారు. ప్రత్యేకించి జనసేనలో కొత్తగా చేరిన కొత్తపల్లి సుబ్బారావు, కొణతాల రామకృష్ణ వంటి సీనియర్ నేతలు సైతం కొద్దిసేపు ప్రసంగించారు. రామకృష్ణ అయితే జనసేన టీడీపీ మాదిరిగానే ఈ రెండింటితో బీజేపీ కలిసి వచ్చేలా చూడాలని కోరడం మరో విశేషం. పవన్ తమ ప్రసంగం ఆఖరిలో బీజేపీకి జై అంటూ ముగించారు. టీడీపీ పక్షాన వేదిక ముందు భాగంలో చంద్రబాబుతోపాటు అచ్చెన్నాయుడు, బాలకృష్ణ, సీతారామలక్ష్మి, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, రఘురామకృష్ణంరాజు కూర్చుండగా పవన్ పక్కన నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కొటికలపూడి గోవిందరాజు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. టీడీపీలో సీనియర్ నేతలు బుచ్చియ్యచౌదరి, చినరాజప్పతో పాటు కొలుసు పార్థ సారథి, చింతమనేని ప్రభాకర్, ముళ్లపూడి బాపిరాజు, కంభంపాటి రామ్మోహన్, నిమ్మల రామానాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాల్గొన్నారు.

జనమే జనం

రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. ఇరు పార్టీల అగ్రనేతలు ఒకే వేదిక పైకి రావడంతో ఈ వేదికకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. దీంతో వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ వేదిక పైకి రాక ముందే పలువురు సీనియర్లు ప్రసంగించారు. నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణంరాజు, బాలకృష్ణ, వలవల బాబ్జి, దుర్గేష్, కొత్తపల్లి సుబ్బారాయుడు వంటి వారు మాట్లాడడంతో జనం కేరింతలతో సభ దద్దరిల్లింది. రఘురామకృష్ణంరాజు సెటైర్లు వేస్తున్నపుడు వేదికపై ఉన్న పవన్, చంద్రబాబు ముసిముసి నవ్వులు చిందించారు. తాను వచ్చే ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేస్తానని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించిప్పుడు సభలో కేరింతలు విన్పించాయి.

అభిమానుల జోష్

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభలో అభిమానుల జోష్ అంతా ఇంతా కాదు. కార్యకర్తలను, అభిమానులను అడ్డుకోవడం పోలీసులు తరం కాలేదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను వీక్షించేందుకు ఫ్లడ్‌లైట్ స్తంభాలను ఎక్కేశారు. మహిళలు అందుకు పోటీ పడ్డారు. పసుపు చీరలు ధరించి వేలాదిగా మహిళలు సభకు తరలి వచ్చారు.



సభలో టీడీపీ నాయకులు



సభలో జనసేన నాయకులు

అవసరమైతే గ్యాస్ గొట్టాలను బ్లాక్ చేద్దాం!

- కేజీ బేసిన్‌లో ఏపీ వాటా దక్కే వరకు దశలవారీ పోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగ ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు, పాల్గొన్న పలువురు నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28: కేజీ బేసిన్‌లో చమురు, గ్యాస్ ఏపీ వాటా దక్కే వరకు దశలవారీ పోరాటం చేయాలని, ఇందులో భాగంగా అవసరమైతే గ్యాస్ గొట్టాలను బ్లాక్ చేద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగ ప్రభాకర్ అన్నారు. కేజీ బేసిన్ చమురు, గ్యాస్ వాటా ఏపీకి దక్కాలని కోరుతూ సీపీఐ, కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో రౌండ్‌టేబుల్ బుధవారం సమావేశం నిర్వహించారు. దీనికి కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్ తాటిపాక మధు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభాకర్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మాట్లాడుతూ నాలుగు జిల్లాల పరిధిలో గ్యాస్, చమురు వ్యాపించి ఉందన్నారు. 25 పార్లమెంటు సీట్లు ఇస్తే ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధిస్తానని చెప్పి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు అడ్డుకోలేకపోయారన్నారు. దీనిపై సీపీఐ భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్ తాటిపాక మధు, కార్య దర్శి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ దీనిపై ముందుగా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేద్దామన్నారు. ప్రముఖ న్యాయవాది జవహర్‌అలీ, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కార్యదర్శి కె.కృష్ణమోహన్, సీపీఎం నాయకుడు దువ్వా శేషబాబ్జి, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరిరాజు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు ప్రసంగించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానాలను, భవిష్యత్తు కర్తవ్యాలను ప్రవేశపెట్టగా సమావేశం ఆమోదించింది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, నారాయణ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకరాజు, ప్రొఫెసర్ దాసగిరిరావు, సైకాలజిస్ట్ సత్యమూర్తి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓట్లు పరిశీలించుకోవాలి

- రిటైర్డు ఎస్ఈసీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 28: ఓటరు జాబితాలో ప్రతిఒక్కరూ తమ ఓట్లు పరిశీలించుకోవాలని, సామాజిక బాధ్యత, కర్తవ్యం, నిబద్ధతతో ఆలోచించి రాజ్యాంగ స్ఫూర్తితో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత యువత, యువ ఓటర్లపై ఉందని రాష్ట్ర ఎన్నికల సంఘం రిటైర్డ్ కమిషనర్, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ రాష్ట్ర కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కళాజాతలో భాగంగా ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాంపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భావితరాలకోసం చట్టసభల్లో ప్రజలకు మేలు చేసే సచ్చీలురైన నాయకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఎన్నికల్లో తప్పనిసరిగా పాల్గొని ఓటుహక్కు వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని అన్నారు. ఓటు వేయకుండా తటస్థులుగా ఉండిపోతే వీళ్ల ఓట్లు చోరీకి గురై చెడు మార్గాల ద్వారా ఓట్లు పొందిన వారు దొంగ ఓట్లు వేస్తారన్నారు. ఓట్ల నమోదులో ఏపీలో జరుగుతున్న పరిణామాలు అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. రాజ్యాంగం ఐసీఐకు విశేష అధికారాలు కట్టబెట్టిందన్నారు. తిరుపతిలో జరిగిన ఉప ఎన్నికల్లో 35వేల దొంగ ఓట్లు సృష్టించడం, ఫిర్యాదుల వెల్లడంతో ఓ ఐఏఎస్ అధికారి, నకిలీ ఈఆర్‌వో సస్పెండ్ అవ్వడం ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేసినట్లుగా అనుమానాలించాల్సి వచ్చిందన్నారు. ఈ ఘటన ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన తనకే ఆశ్చర్యం వేసిందన్నారు. 7 అసెంబ్లీల్లో ఒకస్థానంపై విచారణ చేసి ఇద్దరిని సస్పెండ్ చేశారని, మొత్తం ఎంపీ పరిధిలో మిగతా స్థానాల్లో సమగ్రంగా లోతైన విచారణ చేసి బాధ్యులను గుర్తించాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉందన్నారు. రాజకీయాల కోసం వ్యక్తిగత గోప్యత వివరాలను వాడితే అది ప్రజాస్వామ్య వ్యవస్థకే తీవ్ర ప్రమాదమన్నారు. హెల్త్ యూనివర్సిటీ రిటైర్డు వీసీ ప్రొఫెసర్ ఐవీ రావు, సిటిజన్స్ ఫర్ డమొక్రసీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణరెడ్డి అవగాహన కల్పించారు. కళాజాత కళాకారులు ఓటుహక్కు ప్రాధాన్యం ఓటు విలువపై నిర్వహించిన పలు సాంస్కృతిక, సంగీత ప్రదర్శన అందరినీ అలరించాయి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్



ఏలేశ్వరంలో పశువధ నిర్వహించిన ప్రదేశం

యథేచ్ఛగా పశువధ

- ఏలేశ్వరంలో మూగజీవాల కోత
- జంతు సంరక్షణ సంస్థ ప్రతినిధుల ఫిర్యాదు
- ఇద్దరిపై కేసు నమోదు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 28: ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో మూగజీవాల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు ఏమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. వట్టిపోయిన పశువుల అక్రమ రవాణాతోపాటు మూగజీవాల వధ నిత్యం జరుగుతూనే ఉంది. ఏలేశ్వరం పట్టణ పరిధిలోని మందుల కాలనీ శ్మశానవాటిక సమీపాన పశువులను కోతకు గురిచేస్తున్నారు. ఇలా అక్రమంగా పశువులతో వ్యాపారం చేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఇళ్ల సమీపాన్నే ఈ కార్యక్రమం జరుగుతున్నా అధికారులు దృష్టికి రాకపోవడం ఆశ్చర్యకరమని పలువురు ఆరోపిస్తున్నారు.

జంతు సంరక్షణ సంస్థ ఫిర్యాదు

ఏలేశ్వరంలో జరుగుతున్న పశువధలను అరికట్టాలని జంతుసంరక్షణ సంస్థ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామానికి చెందిన సంస్థ ప్రతినిధి దేవారపు మాణిక్యాలరావు ఏలేశ్వరం పోలీసులకు సమాచారం అందించారు. ఈక్రమంలో పోలీసు సిబ్బంది మందులకాలనీ శ్మశాన వాటికలకు వెళ్లి తనిఖీ చేశారు. అక్కడ రెండు ఎద్దులను చంపి మాంసం తీస్తుండడం గమనించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా మాంసాన్ని భూమిలో పాతిపెట్టారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. తమ ఇళ్ల దగ్గరే పశువుల ప్రాణాలు తీస్తున్నారని మందుల కాలనీ స్థానికులు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. పశువుల కోతతో తాము తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వారు ఆరోపించారు. మిగిలిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపటినుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- కాకినాడ జిల్లాలో 59 కేంద్రాలు ఏర్పాటు
- డీఐఈవో జీజీకే నూకరాజు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారంనుంచి నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు మార్చి 1న ప్రారంభమై 20 వరకూ కొనసాగుతాయని కాకినాడ జిల్లా డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. జిల్లాలో 59 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకూ జరుగుతాయని, పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 22,059మంది, రెండో ఏడాది పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 22,120మంది హాజరుకానున్నారని డీఐఈవో తెలిపారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఇతర అధికారులకు శిక్షణనిచ్చామన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నూకరాజు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో రైతుల ఆందోళన

- 8లో

- గండేపల్లి మండలంలో వరుస ఘటనలు

ఇర్రిపాకలో ఘనంగా మహాకాళేశ్వరుడి కల్యాణం

- 7లో

జెండా జోష్


వేదికపై జనసేన పార్టీ నాయకులు




తెలుగుదేశం పార్టీ నాయకులు


దాహం తీర్చేందుకు చల్లని మజ్జిగ


ఒళ్లంతా జెండాలతో..


అన్న ఎన్టీఆర్


ఫ్లడ్‌లైట్, ఫ్లెక్సీ స్తంభాలపై అభిమానులు



పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు జనం పోటెత్తారు.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాలతో ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు.


వయసు పైబడినా తగ్గేదేలే..


ఊరేగింపులో రెక్కలు విరిగిన ఫ్యాన్


తెలుగు మహిళల సందడి


తాడేపల్లిగూడెం నుంచి జనసేన ర్యాలీ




వేదిక ముందు యువత ఉత్సాహం

వివాహేతర సంబంధం అనుమానంతో దాడి

ఎదురింటి వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఎంపీటీసీ

తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిక

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తిపై ఎంపీటీసీ పదునైన కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఈదరపల్లి రామాలయం వీధిలో ఎంపీటీసీ అడపా సత్తిబాబు కుటుంబం అద్దెకు ఉంటోంది. అతడి ఇంటికి ఎదురుగా ఉన్న ఇంట్లో కొత్తపల్లి సుబ్రహ్మణ్యం (48) కుటుంబం కొన్నేళ్లుగా నివాసం ఉంటోంది. కొత్తపేట పలివెల నుంచి వచ్చిన సుబ్రహ్మణ్యం అమలాపురం, పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్యతో అతడికి వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో బుధవారం మధ్యాహ్నం సత్తిబాబు ఎదురింట్లో ఉన్న సుబ్రహ్మణ్యంపై కత్తితో ఒక్కసారిగా దాడి చేశాడు. కత్తిపోట్లకు చెయ్యి అడ్డు పెట్టడంతో రెండు చేతులతో పాటు మెడ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. హత్యాయత్నం జరిగిన సమయంలో సుబ్రహ్మణ్యం భార్య దేవాలయానికి వెళ్లింది. అక్కడ పూజాధికాలు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేసరికి రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి వెంటనే స్థానికులతో కలిసి 108 అంబులెన్సు వాహనానికి సమాచారం అందించారు. వాహనం రావడంలో జాప్యం జరగడంతో భర్తను తీసుకుని అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లింది. హత్యాయత్నానికి పాల్పడ్డ సత్తిబాబు తాను వినియోగించిన కత్తితో పట్టణ పోలీసులకు లొంగిపోయినట్టు తెలిసింది. సమాచారం అందుకున్న అమలాపురం డీఎస్పీ ఉమామహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. తీవ్రంగా గాయపడ్డ సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంజి డెయిరీపై కేసులు

పెద్దాపురం, ఫిబ్రవరి 28: పెద్దాపురం మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఉన్న అంజి డెయిరీలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు చేశారు. రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఈ దాడులు నిర్వహించారు. 648 కిలోల పామాయిల్, 216 కిలోల నెయ్యి స్వాధీనం చేసుకున్నారు లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు కేసులు నమోదు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు డెయిరీ యజమాని పిల్లి రవికిరణ్‌కు నోటీసులు జారీ చేశారు.

సక్రమంగా ఓటు హక్కు వినియోగించడం

ఓ సామాజిక బాధ్యత

చక్కటి చట్టసభలు ఏర్పడితే జవాబుదారీతనం ఉంటుంది

ప్రజా సంక్షేమానికి తోడ్పడేవారిని ఎన్నుకోవాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం విశ్రాంత ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటు హక్కు సక్రమంగా వినియోగించడం ఓ సామాజిక బాధ్యతని రాజ్యాంగం నిర్దేశించిందని విశ్రాంత రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ చెప్పారు. ఓటు హక్కును వినియోగించుకునే అంశంపై ఓటర్లను చైతన్యం చేసే ఉద్దేశంతో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో 'కళాజాత'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణ, వివేచనతో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైతే ప్రజా సంక్షేమానికి తోడ్పడతారో వారిని ఎన్నికోవడం వల్ల చక్కటి చట్ట సభలు ఏర్పడతాయని.. దాంతో జవాబుదారీతనం ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్టు తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం దారుణమైందని, ఇలా ప్రజలకు ఉపయోగపడని చట్టాలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటు లేదన్నారు. ఈ చట్టం వల్ల భూమిపై యాజమాన్య హక్కును నిరూపించుకోవడం ఎంతో కష్టసాధ్యమని.. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ కింద పని చేసే వ్యవస్థకు ఇష్టముంటే హక్కు కల్పిస్తుందని లేకపోతే ఆ భూమిపై క్రయవిక్రయాలు ఆగిపోతాయన్నారు. ఇలాంటి విషయాలపై కూలంకషంగా చట్టసభల్లో చర్చ జరిగితే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగే వాతావరణం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రయోజనాల కోసం కింది స్థాయి అధికారులు పని చేయడం వల్లే ఓటర్ల జాబితా లోపభూయిష్టంగా తయారైందన్నారు. గతంలో టీచర్లు ఆ విధులు నిర్వర్తించినపుడు విమర్శలు ఇంత పెద్ద ఎత్తున రాలేదన్నారు. బీఎల్‌వోలుగా పని చేసిన వాళ్లను దూరంగా పెట్టాలని, వలంటీర్ల నీడ కూడా ఎన్నికల ప్రక్రియపై పడడానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. కానీ అవ్వాతాతలను స్వయంగా తీసుకెళ్లి ఓటు వేయించాలని వలంటీర్లకు ముఖ్యమంత్రి చెబుతున్నారని ఇది విస్మయం కలిగిస్తోందన్నారు. ఎన్నికల సంఘాన్ని సైతం ధిక్కరిస్తూ వలంటీర్లకు ఆదేశాలిస్తున్నారని దీనిపై అవసరమైతే న్యాయస్థానాలకు వెళ్లి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఓ నిశ్శబ్ద విప్లవం ఆంధ్రప్రదేశ్‌లో మొదలైందని.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, తమ అభీష్టం మేరకు ఎవరైతే సంక్షేమం, అభివృద్ధి చేస్తారో అలాంటి వారికి ఓటు వేయాలన్నారు. ఓటుని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని తీసుకురావడంలో యువత కీలక భాగస్వామ్యం పోషించాలని పిలుపునిచ్చారు. ఓట్లు అమ్మడం కొనడం వంటివి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం అంటే ప్రజల కోసమనే అర్థం మారిపోయిందన్నారు. ప్రజాస్వామ్యం ఆర్థిక నేరగాళ్లు, భూకబ్జాదారులు, రౌడీలు, గూండాల కోసం అనే కొత్త అర్థాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. భావవ్యక్తీకరణ చేసే పాత్రికేయులపై దాడులు చేయడం, వారిపై దేశద్రోహం కేసులు పెట్టడం ప్రజాస్వామ్యం కాబోదని విమర్శించారు. మేధావుల మౌనం సమాజానికి ప్రమాదమని.. మేధావులు, విద్యావంతులు మేల్కోవాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసాన్ని కళ్లారా చూస్తూ కూడా కళ్లు లేని కబోదుల్లాగా మేధావులు ఉంటే వాళ్లు ఈ సమాజానికి అన్యాయం చేసినట్లేనని.. అందువల్ల నియంతృత్వ పాలనను తరిమికొట్టడానికి వారంతా కలిసి రావాలని కోరారు. ముఖ్యంగా విద్యావంతులు, మధ్య తరగతి వారు ఓటు హక్కును ఉపయోగించుకోకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. తొలుత ఓటు ప్రాముఖ్యంపై నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అశోక్ కుమార్ జైన్, కంటిపూడి సర్వారాయుడు, కృష్ణకుమార్ తదితరులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.


ఓటు హక్కు ప్రాముఖ్యంపై గేయాలాపన

ఘనంగా మహాకాళేశ్వరుడి కల్యాణం

ఇర్రిపాకలో కొనసాగుతున్న పూజా కార్యక్రమాలు


ప్రవచనాలు అందిస్తున్న స్వామీజీ

జగ్గంపేట, ఫిబ్రవరి 28: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివ మహా రుద్రాభిషేకంలో భాగంగా బుధవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహాన్యాసము, రుద్రాభిషేకము, బిల్వార్చన, కుంకుమార్చన, నారాయణ ఆవాహనం నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ, మణి, జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని మహా కాళేశ్వరుడు వారి కల్యాణం జరిపించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలకు పంచామృత అభిషేకం, నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు శ్రీ సదనం పీఠాధిపతి శ్రీ పర శివానంద భారతి స్వామీజీ, అఖిల భారత విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు, శ్రీ చక్రపీఠం పీఠాధిపతులు శ్రీ వై లోకనాథ్‌శర్మ హాజరై మహా రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

5 నుంచి విద్యుదుత్పత్తి పునఃప్రారంభం


సీఈ శ్రీధర్

మోతుగూడెం, ఫిబ్రవరి 28: సీలేరు కాంప్లెక్సులో మార్చి 5 నుంచి విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నామని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ తెలిపారు. స్థానిక విలేఖరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా, గోదావరి డెల్టాకు రబీ పంటలకు నీటి విడుదల నేపథ్యంలో సీలేరు కాంప్లెక్సులో ఈ నెల 10నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశామన్నారు. అయితే ప్రస్తుతం పోలవరంలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు విన్నపం మేరకు సీలేరు కాంప్లెక్సులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం బలిమెలలో ఏపీ వాటాగా 19.15 టీఎంసీలు, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో 13.40 టీఎంసీల నీటి నిల్వలతో మొత్తం 32.55 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నీటితోనే రాబోయే మూడు నెలలు (వేసవిలో) నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ కాంప్లెక్సు పరిధిలోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.

వైసీపీలోకి గొల్లపల్లి సూర్యారావు



రాజోలు, ఫిబ్రవరి 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి వెళ్లి సీఎం జగన్ సమక్షంలో బుధవారం వైసీపీలో చేరారు. రాజోలు ఎమ్మెల్యే టికెట్‌ను జనసేనకు కేటాయించడంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. టీడీపీకి, టీడీపీ రాజోలు ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేసిన లేఖను ఫ్యాక్స్ ద్వారా టీడీపీ కార్యాలయానికి గొల్లపల్లి పంపారు. వైసీపీ రాజోలు టికెట్‌ను గొల్లపల్లి ఆశిస్తున్నారు. రాజోలు నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019 నుంచి ఇప్పటివరకు రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పని చేశారు. మాజీ మంత్రి గొల్లపల్లితో పాటు ఆయన కుమారుడు గొల్లపల్లి శ్రీధర్, కొల్లాబత్తుల కుమార్, పితాని సూరిబాబు, చిట్టూరి సంతోష్ వైసీపీలో చేరారు.

గంజాయి పంట దహనం


గంజాయి పంటను దహనం చేస్తున్న పోలీసులు

మోతుగూడెం, ఫిబ్రవరి 28: డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్టగూడెం కొండల్లో సాగు చేస్తున్న గంజాయిని బుధవారం పోలీసులు దహనం చేశారు. గంజాయి సాగు చేస్తున్నారని డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్‌కు వచ్చిన సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వై.రామవరం డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, వీఆర్వో సందీపాచార్యుల సమక్షంలో మెట్టగూడెం కొండల్లో గంజాయి సాగు చేస్తున్న వంతల జైసన్, బురిడి సహదేవ్, కొర్రా సోనియా, పాంగి నాగేశ్వరరావు, కిలో నగేష్, వీరి అప్పారావులపై మెరుపు దాడి చేసి అరెస్ట్ చేశారు. అనంతరం 1.5 ఎకరాల ఫారెస్ట్ లాండ్‌లో సాగు చేస్తున్న సుమారు రూ.2.75 లక్షల విలువ చేసే 550 గంజాయి మొక్కలను నరికేసి కాల్చి బూడిద చేశారు. అనంతరం ఆరుగురు నిందితులను డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ రిమాండ్ నిమిత్తం రంపచోడవరం జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 28: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును ఇద్దరు దొంగిలించుకుపోయారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బందరుపాలానికి చెందిన కోళ్ల సత్యవతి కొత్తలంకలో జరిగే వివాహానికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తుండగా ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై వచ్చి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో ఉన్న వ్యక్తులు తెలుసా అని అడిగారు. ఆమె తెలియదని చెప్పడంతో వారు కొంచెం ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కివచ్చి ఆమె మెడలోని 2 కాసుల బంగారు గొలుసును తెంపుకుపోయారు. ఆమె పోలీసులను ఆశ్రయించగా ఎస్‌ఐ డి.సురేష్‌బాబు అగంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప, ఫిబ్రవరి 28: వేళంగి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. ఈ కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని వేళంగి, సిరిపురం, కూరాడ, చినమామిడాడ, పెదకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు విఘాతం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి'

పిఠాపురం, ఫిబ్రవరి 28: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి పర్వదినాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లపై బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాదగయ పుష్కరిణిలో మహాశివరాత్రి రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేయాలని, క్యూలైన్లు పటిష్టంగా ఉండేలా చూడాలన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవం, మహాశివరాత్రి, శ్రీపుష్పోత్సవం, తెప్పోత్సవం సమయాల్లో అన్నిశాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సమావేశంలో కాకినాడ ఆర్డీవో కిషోర్, డీఎస్పీ హనుమంతరావు, పాదగయ ఈవో, దేవదాయశాఖ సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి తహశీల్దార్ లక్ష్మీ, మున్సిపల్ కమిషనరు కనకారావు, పాదగయ మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

'విరుద్ధంగా ఆటోలు నడిపితే చర్యలు'

గండేపల్లి, ఫిబ్రవరి 28: నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఆటోలు నడిపితే చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు హెచ్చరించారు. ప్రమాదపు టంచుల్లో విద్యార్థుల ప్రయాణం అని మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన సీఐ బుధవారం గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటోల్లో సామర్థ్యానికి మించి నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులు, స్కూల్ పిల్లలను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల వెనుకాల, డ్రైవర్ల పక్కన కానీ ప్రయాణికులను కూర్చోబెట్టరాదన్నారు. ప్రతి డ్రైవర్ యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటోలు ఎక్కడబడితే అక్కడ నిలపరాదన్నారు. ప్రతి ఆటోడ్రైవర్‌కు ఇన్సూరెన్స్, రికార్డులు ఉండాలని. మద్యం తాగి ఆటోలు నడపరాదని సూచించారు.ఏఎస్ఐ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'పరిమితికి మించి ఆటోలో ఎక్కించరాదు'

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 28: పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను ఎక్కించుకోరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని కాకినాడ ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, రమేష్ హెచ్చరించారు. ట్రాఫిక్ 1, 2 స్టేషన్ల పరిధిలో కాకినాడలో పరిమితికి మించి స్కూల్ పిల్లలను ఆటోల్లో తీసుకెళ్తున్న ఆటోలపై ప్రత్యేక డ్రైవ్, అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 20 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన ఆటోడ్రైవర్లకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన వేగంతో విద్యార్థులతో ఆటో నడపరాదన్నారు. డ్రైవర్‌కి ఎడమ, కుడి పక్కన కూర్చోపెట్టి డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'మార్చి 1న ఛలో కలెక్టరేట్'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో మార్చి 1న నిర్వహించే ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఏపీబిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద ఛలో కలెక్టరేట్ పోస్టర్లను భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు ఎ.నిరంజన్, పి.ప్రసాద్, జి.సతీష్, మణి, కె.వీరబాబు, కె.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దాపురం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను కొనసాగించాలని కోరుతూ మార్చి 1న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని కార్మిక సంఘం నాయకులు (సీఐటీయూ) పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, జక్కాని అబ్బు, బైలపూడి నూకరాజు, పోలిశెట్టి భద్రరావు, మాగాపు నాగు రేలంగి వెంకట్రావు, దేవా తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 28: ప్రభుత్వ ఆదేశాల మేరకు నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. బుధవారం ఆయన కాకినాడలోని గైగోలుపాడు, కరణంగారి జంక్షన్, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతాల్లోని సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. మిగిలి ఉన్న రిజిస్ట్రేషన్లు, అందుబాటులో లేని లబ్ధిదారులను గుర్తించి ఆయ రిజిస్ట్రేషన్లపై కూడా దృష్టిపెట్టాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఒకటి, రెండురోజుల్లో అన్ని రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏడీసీ పర్యవేక్షణ

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షించారు. వైద్యనగర్, కృష్ణనగర్, బీసీ కాలనీ ప్రాంతాల్లోని సచివాలయాలను సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరును పరిశీలించి రిజిస్ట్రేషన్లు వేగవంతమయ్యేలా సిబ్బందికి సూచనలిచ్చారు.

'పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలి'

ఏపీఎస్పీ (సర్పవరం జంక్షన్), ఫిబ్రవరి 28: పదో తరగతి పరీక్షలకు సబ్జెక్టు టీచర్లు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఎంఈవో ఎల్ గణేష్‌బాబు కోరారు. మండలస్థాయి పదో తరగతి మార్చి 2020 పబ్లిక్ పరీక్షల కోసం శుక్రవారం లెక్కలు, ఆంగ్లభాష విషయ బోధనకుల సమీక్షా సమావేశం రమణయ్యపేట ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. సబ్జెక్టు టీచర్లుకు సంగ్రహణాత్మక పరీక్షలు, వారాంతపు పరీక్షలు, మూల్యాంకనంపై పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం మీరా సాహెబ్, కొత్తపల్లి మండల పరిధిలోని ఎండపల్లి, కోనపాపపేట, కొత్తపల్లి హైస్కూల్ హెచ్‌ఎంలు ఏవీకె రామాచార్యులు,పీవీఎస్ఆర్‌కే అప్పారావురెడ్డి, ఎం.రమణమూర్తి ఉన్నారు.


ఎంఆర్ విద్యార్థులకు టీఎల్ఎం కిట్ల పంపిణీ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 28: కాకినాడ విద్యాశాఖ భవనంలోని ఎస్ఎస్ఏ సమావేశ హాల్లో జిల్లాలోని మానసిక పరిపక్వత లేని (మెంటల్లీ రిటార్డెడ్) విద్యార్థుల కోసం నెల్లూరులోని సీఆర్సీ, ఎన్ఐఈపీఐడీ ఆధ్వర్యంలో బుధవారం టీఎల్ఎం కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమగ్ర శిక్ష ఐఈ సమన్వయ కర్త చామంతి నాగేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా డీఈవో, ఏపీసీ పిల్లి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని 28మంది ఎంఆర్ విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. రూ.10,000 విలువ గల కిట్‌ను ఉచితంగా అందజేశామని, వీటి ద్వారా విద్యార్థులు ఎవరి పైనా ఆధారపడకుండా వారి పనులను వారే స్వయంగా చేసుకోవచ్చని డీఈవో తెలిపారు. సీఆర్సీ, ఎన్ఐఈపీఐడీ ప్రతినిధి టి.రాకేష్, సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా విగ్రహానికి నివాళి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 28: స్థానిక బోట్‌క్లబ్ వద్ద శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో కవి రాజశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 139వ జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి డీపీఆర్‌వో నాగార్జున, హుస్సేన్ షాలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పక్షులకు ధాన్యపు కుచ్చులు, టైలర్స్ దినోత్సవం పురస్కరించుకుని మలకల సత్యనారాయణ, అనిశెట్టి సోమారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఏవీవీ సత్యనారాయణ, కాకినాడ లక్ష్మీ, రెడ్డి సూర్యప్రభావతి, ఇక్బాల్ అహ్మద్ పాషా, ఖలీల్‌షా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన గుణ్ణం చంద్రమౌళి



సామర్లకోట, ఫిబ్రవరి 28: పెద్దాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున సీటు ఆశించిన గుణ్ణం చంద్రమౌళి అమరావతిలో బుధవారం చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీటు ఇవ్వడం కుదరని వాళ్లను చంద్రబాబు ఇంటికి పిలిచి మాట్లాడుతున్నారు. పార్టీ విజయం కోసం పనిచేయాలని, తర్వాత ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. అనంతరం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కూడా చంద్రమౌళి మర్యాదపూర్వకంగా కలిశారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట, ఫిబ్రవరి 28: రాజపూడికి చెందిన దుంగా రాంబాబు సారా రవాణా చేస్తుండగా జగ్గంపేట ఏఎస్ఐ వీవీ.సుబ్బారావు అదుపులోకి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, ముఖ్య గమనిక, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, అంబాజీపేట మ్యారేజిబ్యాండు, రాజధాని ఫైల్స్, గుంటూరు కారం

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, రాజధాని ఫైల్స్, డ్రీల్, ఊరుపేరు భైరవకోన, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా

తిరుమల: సూర్యపుత్రునేతక్ష్మన్, అంబాజీపేట మ్యారేజిబ్యాండు

లక్ష్మీ	:	ఒక్కడు
సీ అండ్‌సీ1	:	సిద్ధార్థరాయ్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	ఊరు పేరు భైరవకోన
పద్మప్రియ	:	సుందరంమాస్టర్
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	సిద్ధార్థరాయ్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

'పథకాలను సక్రమంగా అమలు చేయాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 28: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా, పారదర్శకంగా అమలు చేయాలని ఎంపీడీవో పి.నారాయణమూర్తి కోరారు. శుక్రవారం రమణయ్యపేట మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో పలు సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. పింఛన్లను మార్చి 1న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి డబ్బులు అందజేయాలన్నారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ బొబ్బిలి గోవింద రాజులు,పంచాయతీకార్యదర్శులున్నారు.

తరలిన టీడీపీ, జనసేన శ్రేణులు

తాడేపల్లిగూడెంలో బహిరంగ సభకు భారీగా కార్లు, బస్సుల్లో పయనం



కాకినాడ సిటీ: వాహనాలు ప్రారంభిస్తున్న కొండబాబు, పిఠాపురం: జెండా ఊపుతున్న వర్మ, పెద్దాపురం: తరలిన టీడీపీ కార్యకర్తలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెంలో బుధవారం జరిగిన తెలుగు విజయకేతన బహిరంగ సభకు కాకినాడ నుంచి సిటీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో 5 బస్సులు, 200 కార్లలో టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆయన వాహనాలను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. తెలుగుదేశం-జనసేనల ఉమ్మడి నాయకత్వంలో ఏర్పాటు చేసిన ఈ బహిరంగ సభ కొత్త చరిత్ర సృష్టించనుందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి జగన్‌రెడ్డిని శాశ్వతంగా ఇంటికి పంపించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, పలివెల రవి అనంతకుమార్, వొమ్మి బాలాజీ, తుమ్మల సునీత, బంగారు సత్యనారాయణ, ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబు, అంబటి చిన్న, గుజ్జు బాబు, కొల్లా బత్తుల అప్పారావు, సీకోటి అప్పలకొండ పాల్గొన్నారు.

పిఠాపురం: తాడేపల్లిగూడెంలో జరిగిన తెలుగుదేశం-జనసేన జెండా సభకు నియోజకవర్గం నుంచి తెలుగుతమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. పిఠాపురం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెళ్లిన బస్సులు, కార్లు, మినీబస్సులను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ జెండా ఊపి ప్రారంభించారు.

సామర్లకోట: ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ ఆధ్వర్యంలో రూరల్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జన సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. అచ్చంపేటలోని ఎమ్మెల్యే చినరాజప్ప స్వగృహం నుంచి సుమారు 25 కార్లలో బయలుదేరి ఉండూరు మీదుగా సామర్లకోట చేరేసరికి పెదబ్రహ్మదేవం, జీ.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, వీకె. రాయపురం, మాధవపట్నంల మీదుగా సామర్లకోటకు చేరుకున్న మరో 25 వాహనాలు కలిసి 50 కారులలో తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు.

గండేపల్లి: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆదేశాల మేరకు గండేపల్లి మండలం నుంచి అధికసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో మురారి చేరుకుని అక్కడ నుంచి సుమారు 4వేల మందికి పైగా కార్యక్రమానికి తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, సుంకవిల్లి రాజు, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు తదితరులున్నారు.

ప్రత్తిపాడు: తాడేపల్లిలో భారీ బహిరంగ సభకు నియోజకవర్గం 4 మండలాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో టీడీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి సత్యప్రభ హైస్కూల్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డులో 360 కార్ల కాన్వాయ్‌కు జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తాడిబోయిన చంద్రశేఖర్ యాదవ్, నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, బద్ది రామారావు, సూది బూరయ్య ఉన్నారు.

కొత్తపల్లి: తాడేపల్లి గూడెంలో టీడీపీ, జనసేన భారీ బహిరంగసభకు మండలం టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు వేర్వేరుగా 35 వాహనాలు, 8 బస్సుల్లో భారీగా తరలివెళ్లారు.

పెద్దాపురం: టీడీపీ, జనసేన కూటమి సంయుక్తంగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన బహిరంగ సభకు పట్టణ, రూరల్ గ్రామాల నుంచి పలు వాహనాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు తరలివెళ్లారు. నేతలు వాహనాలకు జెండాలను ఊపి ప్రారంభించారు.

కరప: టీడీపీ, జనసేనపార్టీల మండలాధ్యక్షులు దేవు వెంకన్న, బండారు మురళీ సంయుక్త ఆధ్వర్యంలో మండల గ్రామాల నుంచి ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు తాడేపల్లిగూడెం సభకు వెళ్లారు.

తాళ్లరేవు: తాళ్లరేవు మండలం నుంచి టీడీపీ, జనసేన నేతలు భారీసంఖ్యలో బస్సులపై పి.మల్లవరం, పోలేకుర్రు, కోరింగ, సుంకరపాలెం, జార్జీపేట, నీలపల్లి, చొల్లంగి తదితర గ్రామాల నుంచి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రోళ్ల శ్రీనివాస చక్రవర్తి, గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్తిబాబు, ధూళిపూడి వెంకటరమణ, మోపూరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

కిర్లంపూడి: మండలం నుంచి పెద్దఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ వాహనాలతో ర్యాలీగా వెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం దుర్గాడ నుంచి సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపకుడు, జనసేన నేత జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్సులు, కార్లల్లో తరలివెళ్లారు. గొల్లప్రోలు నుంచి జనసేన నేత కదారి తమ్మయ్యనాయుడు ఆధ్వర్యంలో జనసేన నాయకులు, జనసైనికులు తరలివెళ్లారు.



కరప: అరట్లకట్టలో సైన్స్ ప్రాజెక్ట్ పరిశీలన



కాజులూరులో విద్యార్థులకు బహుమతులు

ఘనంగా సైన్స్ దినోత్సవం

కరప, ఫిబ్రవరి 28: మండలంలోని కరప, అరట్లకట్ట, నడకుదురు, గురజనాపల్లి, గొర్రిపూడి, వేళంగి, వేములవాడ, కూరాడ, పెద్దాపురప్పాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ ప్రాజెక్టులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ పరిశీలించి అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలందజేశారు. పాఠశాలల వారీగా ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టులు, వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాజులూరు: కాజులూరు జడ్పీ హైస్కూలులో పంపన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి సహకారంతో సుమారు 100 ప్రాజెక్టులతో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి ఎమ్.శ్రీనివాస్ వినీల్ సైన్స్ ప్రదర్శనను పరిశీలించి బహుమతులు అందజేశారు. ఉపసర్పంచ్ దండంగి చిన్నారావు, స్కూల్ కమిటీ చైర్మన్ కోన రాధాకృష్ణ, శామ్యూల్‌బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో వేడుకల్లో ఇస్రో మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ మట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం అద్భుతమైన రీతిలో అనేక విజయాలు సాధిస్తోందన్నారు. విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రగడ ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో వేడుకల్లో ఇస్రో మాజీ శాస్త్రవేత్త శివప్రసాద్ అతిథిగా విద్యార్థులకు పలు అంశాలు వివరించారు.

జగ్గంపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమానికి ఇస్రో మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ ముఖ్య అతిథిగా, ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ చెన్నారావు, కె.వెంకటేశ్వరరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట అయోధ్యారామపురం మున్సిపల్ ఉన్నతపాఠశాల ఆవరణలో హెచ్ఎమ్ రాజు ఆధ్వర్యంలో సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్విజ్, రంగోలి, సైన్స్ మ్యాజిక్‌షో, సైన్స్ స్కిట్స్ డిబేట్, ప్రాజెక్ట్ వర్కు్ నిర్వహించారు. కె.సత్యనారాయణ, ఏఎల్వీ.కుమారి, కె.శ్రీనివాస్, సీ.భద్రం, కె.శేషారత్నం ఉన్నారు.

తుని రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ, బోటనీ డిపార్టుమెంట్‌లో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ గంట్ల చిన్నారావు, ల్యాబ్ సీఈవో సత్యనారాయణ పిల్లలకు సైన్స్ ప్రయోగంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.లలిత, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, వరప్రసాద్,శ్రీనివాస్, రామూర్తి, గోవిందు సర్టిఫికెట్లు అందజేశారు.

చిరు వ్యాపారి కుటుంబంపై దౌర్జన్యం

షాపు ముందు పెంట వేసిన వైనం



షాపు ముందు ట్రాక్టర్‌తో వేసిన పెంట

రౌతులపూడి, ఫిబ్రవరి 28: రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం శివారు తలుపులమ్మలోవకు వెళ్లే దారిలో చాలాకాలంగా చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న ఓ కుటుంబంపై స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి దౌర్జన్యం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. తాము ఉంటున్న ప్రాంతాన్ని విడిచి వెళ్లాలంటున్నారని, ఆ భూమికి తమ వద్ద పట్టా ఉన్నా వారు ఖాళీ చేయాలంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిగా తాము వారి మాట వినకపోవడంతో తమ షా పు ముందు మంగళవారం పెంట కూడా వేశారన్నారు. పెట్రో ల్ పోసి తగలబెడతామని హెచ్చరించడంతో తమకు వారినుంచి ప్రాణహాని ఉందంటూ బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.అగ్రహారానికి చెందిన పల్లా లక్ష్మీ, దేవుడు దంపతులు గ్రామశివారు తలుపులమ్మలోవకు వెళ్లే రహదారి మార్గంలో సర్వే నెంబర్ ఆరులో ప్రభుత్వ భూమిలో షాపు నిర్మించుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. షాపు ఉన్న స్థలంలో 2సెంట్లకు ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని వారు చెప్తున్నారు. ఈ స్థలానికి ఆనుకుని ఉన్న భూమిని వైసీపీ సానుభూతిపరుడైన పి.శ్రీను అనే వ్యక్తి ఏడాది క్రితం కొనుగోలు చేశాడన్నారు. అప్పటి నుంచి అతడికి భూమికి తమ షాపు అడ్డంగా ఉందని బెదిరిస్తున్నా డన్నారు. మంగళవారం ట్రాక్టర్‌తో పెంటను తెచ్చి షాపు ముందు వేశాడన్నారు. భయంగా ఉందని, సంబంధిత వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

ప్రజాప్రతినిధుల పట్ల మీ గౌరవం ఇదేనా!

వైసీపీ తీరుకు నిరసనగా టీడీపీ కౌన్సిలర్ల వాకౌట్, వాడివేడిగా మున్సిపల్ సమావేశం



టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

పిఠాపురం, ఫిబ్రవరి 28: బీసీ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల చూపే గౌరవం ఇదేనా అంటూ వైసీపీ ప్రతినిధులపై టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తీరుకు నిరసనగా కౌన్సిల్ సమావేశం నుంచి వారు వాకౌట్ చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. ప్రారంభమైన కొంత సమయానికే అత్యవసర పనులు ఉన్నాయంటూ చైర్‌పర్సన్ బయటకు వెళ్లిపోయారు. దీంతో వైస్‌చైర్మన్-1గా ఉన్న పచ్చిమళ్ల జ్యోతి సమావేశానికి అధ్యక్షత వహించేందుకు వచ్చారు. ఈ సమయంలో టీడీపీ కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ మాట్లాడుతూ కౌన్సిల్ ఏర్పడిన నాటి నుంచి చైర్మన్ అందుబాటులో లేనప్పుడు అధ్యక్షత వహించేందుకు వైస్‌చైర్మన్-1కే అవకాశం ఇస్తున్నారని, ఈ సారి బీసీ మహిళ అయిన వైస్ చైర్మన్-2 కొత్తపల్లి పద్మకు అవకాశం ఇవ్వాలని సూచించారు. బీసీ మహిళకు ఒక్క అవకాశం ఇస్తే సమంజసంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అయితే సమావేశానికి అధ్యక్షత వహించే విషయంలో నిబంధనలు ఉంటాయని, వాటిని పాటించాల్సి ఉంటుందని వైసీపీ కౌన్సిలరు తలిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ జోక్యం చేసుకుంటూ తమకు ఎవరికి అవకాశం ఇవ్వాలో తెలుసునని, మా పార్టీ విషయాలతో మీకు సంబంధం ఏమిటని, తమలో తమకు గొడవలు పెట్టాలని చూస్తున్నారా అని వాఖ్యానించారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ కోఆప్షన్ సభ్యునికి మాట్లాడే అవకాశం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ సమయంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. బీసీ మహిళా ప్రజాప్రతినిధులను అవమానపరిచేలా వ్యవహరించారంటూ టీడీపీ కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. పట్టణంలో పలు వార్డుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా సాగడం లేదని, నీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కమిషనరు కనకారావు తదితరులున్నారు.

సమావేశాలంటే అధికారులకు గౌరవం లేదు

సామర్లకోట కౌన్సిల్‌లో సభ్యులు

సామర్లకోట, ఫిబ్రవరి 28: సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా ఇటీవల సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల సమావేశాల నిమిత్తం టెంట్లు, కుర్చీలు స్నాక్స్ వంటి వాటికి రూ.39వేల చొప్పున రూ.3.25 లక్షలు ఖర్చయినట్టు అజెండాలోకి ఆమోదం నిమిత్తం తీసుకురాగా అధికారపక్ష సభ్యులు ఆవాల లక్ష్మీనారాయణ, పితాని కృష్ణ, సేపేని సురేష్, పిట్టా సత్యనారాయణ, రెడ్నం సునీత తీవ్రంగా ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి బిల్లులుంటే పెట్టాలని పలువురు సభ్యులు కోరగా అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని పలువురు కోరగా అందుకు చైర్‌పర్సన్ అరుణ అంగీకరించారు. కౌన్సిల్ సమావేశాలంటే అధికారులకు ఎంతమాత్రం గౌరవభావం లేనందునే ప్రతీ సమావేశంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని లక్ష్మీనారాయణ, జాన్ మోజెస్‌లు ఆరోపించారు. టిడ్కో ప్లాట్‌లను లబ్దిదారులకు అప్పగించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడం వల్ల మేమే స్వాధీనపరుస్తామని కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ హెచ్చరించారు. నూతనంగా కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన మన్యం చంద్రరావును సభ్యులు ఆహ్వానించారు. అజెండాలోని 1,7,20 అంశాలను సభ్యుల వ్యతిరేకత దృష్ట్యా వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో రైతుల ఆందోళన

గండేపల్లి మండలంలో వరుస ఘటనలు



కె.నాయకంపల్లిలో రాగి వైరు తీసేసి పడేసిన ట్రాన్స్‌ఫార్మర్

గండేపల్లి, ఫిబ్రవరి 28: గండేపల్లి మండలంలో వరుస ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో రైతులు హడలెత్తిపోతున్నారు. ఇలా అయితే వ్యవసాయం చేయడం కష్టమేనని వాపోతున్నారు. మంగళవారం రాత్రి మండలంలో జడ్.రాగంపేట గ్రామ పరిధిలో కె.నాయకంపల్లి గ్రామానికి చెందిన మాసిన పద్మావతి, చెరుకూరి సత్యనారాయణ, బూరుగుపల్లి అమ్మాజీ, గోళ్ల వాసుకు చెందిన 5 ట్రాన్స్‌ఫార్మర్లను దుండగలు ఎత్తుకుపోయినట్టు రైతు మాసిన సత్యనారాయణ తెలిపారు. ఇదేమాదిరిగా నెలా 15 రోజుల కిందటే గండేపల్లి నుంచి మురారి వెళ్లే దారిలో సుమారు 5 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసిన సంగతి తెలిసిందే. మండలంలో అడపాదడపా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో రైతులు కంటి మీద కునుకు లేకుండా రాత్రి వేళల్లో బోర్ల వద్దే కాపలా ఉంటూ బెంబేలెత్తిపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేయడం వల్ల పంటకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. అలాగే జడ్.రాగంపేటలో ప్రస్తుతం పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు లేక విద్యుత్ సరఫరాక నీరందక పంటలు ఎండిపోయేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ల లోపల ఉన్న రాగి వైర్లను దొంగిలించి ఖాళీ డబ్బాలు వదిలేసి వెళ్లిపోతున్నారన్నారు. రాగివైరు రూ.5వేల నుంచి 6వేలు కూడా రాదని మళ్లీ తాము ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటే రూ.50వేల నుంచి 70 వేల వరకు ఖర్చవుతుందని దానికి తోడు పంట నష్టం కూడా చవిచూడాల్సివస్తుందన్నారు. ఈ చోరీలు అరికట్టకపోతే వ్యవసాయం సాగు చేయలేమని రైతులు వాపోతున్నారు. దీనిపై సీఐ ఎస్.లక్ష్మణరావును వివరణ కోరగా రాత్రి వేళల్లో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి నిఘా పెడతామన్నారు. దొంగలను పట్టుకుంటామని, కొత్తవారు ఎవరైనా సంచరిస్తే తక్షణం తెలపాలని రైతులను కోరారు.

పలుచోట్ల టైలర్స్ డే

ఏలేశ్వరం, ఫిబ్రవరి 28: టైలర్స్ డే సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణ స్వామి ఆధ్వర్యంలో వారి నివాసంలో శ్రీసాయి టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమలలు వేసి నివాలులర్పించారు. ప్రత్తిపాడు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ మాట్లాడారు. దర్జీలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి పాల్గొన్నారు.

కోటనందూరు: నూకాలమ్మ ఆలయంలో శ్రీనూకాంబిక టైలర్ సంఘం అధ్యక్షుడు కె. గోవిందు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఎస్‌కే. మీరా, ఎన్.ఆదినారాయణ, ఎ.నాని, ఆర్, నానిబాబు, ఎమ్.నాగబాబు, పి.రాంబాబు పాల్గొన్నారు.

గండేపల్లి: మురారిలో విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు వంకా సత్యనారాయణ, ఉప్పనపల్లి ధర్మరాజు, గిడుతూరి వెంకటేశ్వరావు, ఆలేటి కృష్ణ పాల్గొన్నారు.

లక్ష పసుపుకొమ్ముల నోము



గొల్లప్రోలులో నిర్వహించిన లక్ష పసుపుకొమ్ముల నోము

గొల్లప్రోలు, ఫిబ్రవరి 28: గొల్లప్రోలు పట్టణంలో బుధవారం లక్ష పసుపుకొమ్ముల నోము వైభవంగా జరిగింది. పసుపుకొమ్ములు, గరిసే ధాన్యం నోము నిర్వహించిన అనంతరం పుణ్యస్త్రీలకు గొల్లపూడి శ్రీరామచంద్రమూర్తి, జయలక్ష్మి దంపతులు పసుపుకొమ్ములను పంపిణీ చేశారు. కొల్లూరి పవన్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

'అంబేడ్కర్ యుగ పురుషుడు'

కొత్తపల్లి, ఫిబ్రవరి 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యుగ పురుషుడని కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. కొత్తపల్లిలో వీవీఎస్ విద్యాసంస్థల సమీపంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పునఃనిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర గంగాభవానీ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, రైతు భరోసా కేంద్ర మండల సలహాసంఘ అధ్యక్షులు జ్యోతుల బాబలు, వైసీపీ కొత్తపల్లి మండలాధ్యక్షులు ఆనాల సుదర్శన్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, వడిశెట్టి నారాయణ రెడ్డి, మాదిరెడ్డి దొరబాబు,జ్యోతుల చక్రబ్బాయి పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 28: 3వ డివిజన్ సురేష్‌నగర్ పార్కులో రూ.20 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన వైఎస్సార్ కన్వర్టబుల్ ఇండోర్ స్టేడియాన్ని కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కార్పొరేషన్ కమిషనర్, స్మార్ట్‌సిటీ ఎండీ జె.వెంకటరావు, వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్వోలకు ముగిసిన శిక్షణ

పెద్దాపురం, ఫిబ్రవరి 28: ఎన్నికల విధులపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బీఎల్వోలకు గత 2 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఆర్డీవో జె.సీతారామారావు హాజరై ఎన్నికల విధులు, నిర్వహణపై అవగాహన కల్పించారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల విధుల, పోలింగ్ ప్రక్రియ విధానాలపై మాస్టర్ ట్రైనీ కెనడీ శిక్షణ ఇచ్చారు.

రైల్వే గేటు ట్రాక్ మరమ్మతులు

సామర్లకోట, ఫిబ్రవరి 28: సామర్లకోట ఉత్తర కేబిన్ వద్ద రైల్వే గేటు ట్రాక్ మరమ్మతులు దృష్ట్యా బుధవారం ఉదయం నుంచి గేటు పూర్తిగా మూసివేశారు. పనులను మార్చి 6 సాయంత్రం వరకూ నిర్వహించనున్నట్టు రైల్వే సీనియర్ శెక్షన్ ఇంజనీర్ బీవీ శ్రీనివాసరావు వెల్లడించారు. ట్రాక్ పునర్నిర్మాణ పనులను రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించారు. గేటు మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లిడంతో స్టేషన్ సెంటర వద్ద రద్దీ ఉంది.

సీపీఐ ఎంఎల్ కార్యకర్తల ఆందోళన

తుని రూరల్, ఫిబ్రవరి 28: పేదలకు పట్టాలు అందజేయాలని, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకత్వంలో ఎన్నో పోరాటాలు ద్వారా సాధించుకున్న భూములకు ప్రభుత్వం సర్వే చేసి సాగుదారులందరికీ పట్టాలివ్వాలని సీపీఐ ఎంఎల్ కార్యకర్తలు, కార్మికులు తునిలో ఆందోళన చేపట్టారు. కె.జనార్థన్, శివ, దొరబాబు, దడాల నూకరత్నం పాల్గొన్నారు.

చొల్లంగిలో మహిళల నిరసన

తాళ్లరేవు, ఫిబ్రవరి 28: చొల్లంగిలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని 29 రోజులుగా శిబిరంలో కూర్చుని నిరసన తెలుపుతున్నా స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కు మార్‌కు పట్టదా అని పలువురు మహిళలు ప్రశ్నించారు. రానున్న రోజులన్ని ప్రజలవేనని గుర్తించుకోవాలని తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

కాజులూరు, ఫిబ్రవరి 28: మండలంలో ఆర్యవటం గ్రామానికి చెందిన పురాతన రామాలయ పునర్నిర్మాణానికి గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. బీసీ సంక్షేమశాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సనపల ధనరాజు దంపతుల చేతుల మీదుగా బుధవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గెల్లి సత్తిబాబు, విశ్వనాధం, ఆవాల శ్రీను, చుండ్రు వీర్రాజుచౌదరి, అంగర శ్రీనివాస్, దాసరి బాబులు, కోట పద్మావతి, తాతబ్బాయి, వెలగా బాబ్జీ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

తొండంగి, ఫిబ్రవరి 28: సీతారాంపురంలో రూ.53 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. జడ్పీ వైస్‌చైర్మన్ మేరుగు పద్మలత, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాకినీడిబాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యెలిశెట్టి గిరి, గాబురాజు ఉన్నారు.

వైసీపీకి రామ్‌కుమార్ రాజీనామా

కిర్లంపూడి, ఫిబ్రవరి 28: వైసీపీ నేత ఎస్ఎస్ రామ్‌కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కిర్లంపూడి తన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వెంటే తన పయనమన్నారు. ఆయన కుమారుడు గిరిబాబు రాజకీయ పార్టీలోకి రానున్నారని, ఆయన వెంటే ఉండి విజయానికి కృషి చేస్తానన్నారు.

చట్టాలపై అవగాహన

ఏలేశ్వరం, ఫిబ్రవరి 28: మండలంలోని లింగంపర్తిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది అవసరాల దేవి న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సతీష్, మురళీ కృష్ణ పాల్గొన్నారు.